# చీకటిలో వెలుగు

"హౌ ఈజ్ ది గ్రేటెస్ట్ మెజీషియన్? ... కెన్ ఎనీ బడీ ఆన్సర్?"—నిశ్శబ్దంగా ఉన్న ఆ ఇంగ్లీషు క్లాస్‌లో పరంధామయ్య గారి గొంతు ఖంగుమంటూ మ్రోగింది.

మధ్య వరసనుంచి ఒకడు లేచి "గాడ్ సర్" అన్నాడు ఆయన ముఖంలోనికి చూస్తూ. గంభీరంగా పరంధామయ్యగారొకమాటు చూసి "సిడౌన్" అన్నారు మామూలుగా. తరువాత ఏ భావాన్ని కనిపించనీయకుండా పాఠాన్ని కొనసాగించారు.

గంట కొట్టిన తర్వాత క్లాసునుంచి వస్తూ ఆలోచించుకోసాగారు పరంధామయ్యగారు "హు గాడ్? ఎవరా గాడ్? ఎక్కడున్నాడు? ... కళ్ళు మూసుక్కూచున్నాడా? ... లేకపోతే ఇన్ని అన్యాయాలూ, అనర్థాలూ జరుగుతూంటే చూస్తూ ఊరుకుంటాడా?" లోకంలోని అన్యాయాలన్నీ తన ఇంట్లో జరుగుతున్నట్టు బాధపడ్డారు.

అయిదేళ్ళు వెనక్కు వెళ్ళిన పరంధామయ్యగారి మనసు, గోదావరి తీరానఉన్న ఆయన చిన్న బంగళాను, కుటుంబాన్ని, బంగారంలాంటి మాగాణీ భూముల్ని చూచి, ఒక్కసారి ఆనందంగా పులకరించింది. కానీ, అవి ఈనాడు ఏమయ్యాయి? ఏం జరిగింది? పరంధామయ్యగారి మనసు విహ్వలమైపోయింది.

ఆ రోజు ... ఆ దుర్ముహూర్తపు రాత్రి ... ఆయన కుటుంబమంతా ఆరుబయట మంచాలు వేసుకుని హాయిగా పడుకున్నారు. పరంధామయ్యగారి మనసు ఆనందపు టంచుల్ని తాకుతున్నది. తన బిడ్డ ... తమ మొదటి నోములపంట ... రేపే వెళుతున్నాడు, అమెరికా! పి.హెచ్.డి. చేసి దిగ్విజయంగా వస్తాడు. తన కెంత గర్వం! ఎంత ఆనందం! ... తన కేం తక్కువ! ఆణిముత్యాల్లాంటి ఇద్దరు పిల్లలు. దర్జా అయిన లెక్చరర్ ఉద్యోగం. తను ఎంత అదృష్టవంతుడు! – అలోచిస్తూనే నిద్రలోకి జారారు పరంధామయ్యగారు.

ఒక రాత్రప్పుడు వచ్చింది తెలివి ... ... ... కాని ... అదేమిటి...

**మొదటి బహుమతి రూ. 50/-**

మునగవలస దుర్గాప్రసాద్‌రావు
3వ సం. బి.ఎస్.సి. (అగ్రి),
అగ్రికల్చర్ కాలేజీ,
భువనేశ్వర్.

అంతా జలమయం... ...కొట్టుకు పోతున్నట్టు చప్పుళ్ళు ... కేకలు... తన ఇల్లేదీ! ... తానెక్కడున్నాడు!.. తన సంసారం? ...తను మాత్రం పెద్ద దిబ్బకు మంచంతోపాటు తగుల్కొని ఉన్నాడు... ...అయ్యో!తన వారంతా మునిగి పోయారా? భగవంతుడా! రక్షించు తండ్రీ" దుఃఖించడమే ఆయన వంతయ్యింది. తరువాత వరద తీయడంతో, తన వారిని వెతుక్కొనడంతో తనకు భార్యా, రెండవ వాడూ మాత్రం దక్కారు. అంది వచ్చిన పెద్దకొడుకు, ఫారిన్ వెడతాడనుకున్న చెట్టంతవాడూ... తన్ను నట్టేటముంచి వెళ్ళిపోయాడు. ఇరవై ఎకరాల మాగాణి కొండంత ఎత్తున ఇసుక మేటలు వేసింది. చక్కని బంగాళా..కర్రలుకూడామిగలకుండా కొట్టుకుపోయింది వరదల్లో... ... ఎక్కడది? ...ఎక్కడా సంతోషం...? ఎక్కడా స్వర్గం?...ఎక్కడా దేవుడు ఎందుకా ఘోరశిక్ష తనకు... భగవంతుడు లేడు అన్న కఠోర నిశ్చయానికి తానానాడే వచ్చాడు...తన మొదటి కొడుకు గురించి దుఃఖించని క్షణం లేదు...ఆ పట్టుదలతోనే...ఆ దీక్షతోనే రెండవ వాడిని పెంచి ప్రయోజకుని చేసి, పెద్దవాని ఆశయాలకు ప్రతినిధిగా అమెరికా పంపి దేవుడిని గెలిచినంత తృప్తిగా నిట్టూర్చారు-- ఆలోచన లోంచి తేరుకుని నడువసాగారు.

* * *

పేపరు పట్టుకొని గబగబా ఇంటికొచ్చి ఆత్రుతగా ఆరాటంగా పిలిచారు పరంధామంగారు భార్యని. చూడు పార్వతీ! మన రెండోవాడు ఎప్పుడొస్తానని రాశాడు? నాకు జ్ఞాపకంలేదు...సరిగ్గా...ఎన్నిగంటలకు? ...చెప్పు పార్వతీ" అంటూ గాభరాగా వణకసాగారు పరంధామయ్యగారు.

ఏమయిందండీ?... ఎందుకలా అవుతున్నారు ... ఈవాళే...సరిగ్గా నాలుగ్గంటలకు వచ్చే ప్లేను లో వస్తానని రాశాడు... ఇంతకీ ..." అంటున్న దావిడ ... "పార్వతీ!" అంటూ భయంకరంగా అరిచారు పరంధామయ్య. "అయిపోయింది పార్వతీ! సర్వ నాశనం జరిగింది... మన రాజు వస్తున్న ఆ విమానం కూలిపోయింది... మన జీవితాలు ఎడారులయ్యాయి ... హయ్యో! భగవంతుడా! ఎన్నివిధాల కష్ట సాధిస్తున్నావయ్యా" అంటూ విలపించ సాగారు. ఆనాడు రోదనలకా యిల్లు నిలయ మయింది.

క్షణాని కే వార్త వినాలో అన్న గుండెకోతతో యుగంలా గడిపారా రోజును ఆ వృద్ధ దంపతులు ... తమ జీవితాల గతేమిటి?

మర్నాడు ఉదయానే "నాన్నా" అన్న రెండుముక్కలూ కర్ణపేయంగా సోకాయి వారి చెవులకు ... అనుమానంగా ... ఆశ గా వాకిట్లో కొచ్చిన ఆ యిరువురూ ఆశ్చర్యా

నందాలతో కొయ్యబారి పోయారు, ఏం జరిగింది నాన్నా! ఎందుకలా అవుతున్నారు ఆశ్చర్యంగా చూశాడా అగాతకుడు. "బాబూ" అంటూ ఆనందంగా అతనిమీద వాలిపోయారా దంపతులు. జరిగిన సంగతి తెలుసుకున్న రాజు నవ్వుతూ "అసలు నేను ఆ ప్లేను మిస్ అయిపోయాను. సమయానికి నా థీసీస్ బుక్స్ మరిచి పోవడంతో ఉండిపోవలసి వచ్చింది. సరే ... టికట్టు మార్చుకో వచ్చని తిరిగి వెళ్ళిపోయాను ... ఎంక్వయిరీ అయినా చెయ్యకుండా అనవసరంగా బాధపడ్డారన్న మాట అంటూ ముగించాడు. "అంతా ఆ దేవుని చలవ బాబూ. ఆ పుస్తకాలు మరిచి పోవడం అంతా అతని మహిమవల్లే! .. అతనే ఈ ప్రమాదాన్నించి నిన్ను తప్పించాడు" అన్నదతని తల్లి చేతులెత్తి కనబడని ఆ దేవ దేవునికి నమస్కరిస్తూ.

పరంధామయ్యగారు దీర్ఘంగా శూన్యంలోకి చూస్తూ "గాడ్ ... ది గ్రేటెస్ట్ మెజీషియన్" అన్నారు తేలిగ్గా నిట్టూర్చుతూ.

* * *

